

కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్



- జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు షురూ
- జూన్ 4న ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం
- మధ్యాహ్నం రెండు తర్వాతే వెల్లడికానున్న పూర్తి ఫలితాలు
- తొలి ఫలితం పెద్దాపురం.. ఆఖరి ఫలితం కాకినాడ రూరల్ నియోజకవర్గం
- అత్యధికంగా కాకినాడ రూరల్‌లో 19 రౌండ్లు, పెద్దాపురం 15 రౌండ్లలో కౌంటింగ్
- ఒక్కో నియోజకవర్గం ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్ల చొప్పున ఏర్పాట్లు
- జిల్లాలో 18,470 పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు 32 టేబుళ్లు
- తుని, కాకినాడ రూరల్, కాకినాడ సిటీలో ఫలితాలు రెండు రౌండ్లలో వెల్లడి
- మొత్తం బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు రెండు నుంచి నాలుగు గంటల వ్యవధి

జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. మరో 11 రోజులు మాత్రమే ఎన్నికల ఫలితాల సమయం వ్యవధి ఉంది. అసెంబ్లీ స్థానాల వారీగా పోలైన ఓట్లు, మొత్తం పోలింగ్ బూత్‌ల ఆధారంగా లెక్కింపు టేబుళ్ల సిద్ధం చేస్తున్నారు. జూన్ 4న ఉదయం ఎనిమిది నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓట్లను తొలుత లెక్కించనున్నారు. ఆతర్వాత అసెంబ్లీ స్థానాల వారీగా ఈవీఎంల్లో ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుంది. మొత్తం పూర్తి స్థాయి ఫలితాలు వెల్లడికి మధ్యాహ్నం రెండు దాటనుంది. కాగా జిల్లాలో తొలి అసెంబ్లీ ఫలితం పెద్దాపురం నియోజకవర్గంలో వెల్లడికానుంది. ఆఖరి ఫలితం కాకినాడ రూరల్‌ది తేలనుంది. పెద్దాపురంలో ఓట్ల లెక్కింపు 15 రౌండ్లలో పూర్తికానుంది. జిల్లాలో అతి తక్కువ రౌండ్లలో ఫలితం తేలేది ఈ నియోజకవర్గంలోనే. ఆ తర్వాత అత్యధికంగా కాకినాడ రూరల్ నియోజకవర్గ ఫలితాలు 19 రౌండ్లలో తేలనుంది. కాగా జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఫలితాలు ఉదయం పది నుంచి ఒక్కో నియోజకవర్గం వారీగా మధ్యాహ్నం 12 వరకు వెల్లడికానున్నాయి.

కాకినాడ (ఆంధ్రజ్యోతి)/ కలెక్టరేట్ :

కాకినాడ జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు 2024 ఓట్ల లెక్కింపునకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. జేఎన్‌టీయూ కాకినాడలో ఈమేరకు ఏర్పాట్లు చేశారు. జూన్ 4వతేదీన ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ఆరంభమవుతుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఈప్రక్రియ ముగియడానికి ఒక్కో నియోజకవర్గానికి రెండు నుంచి నాలుగు గంటల వ్యవధి పట్టనుంది. అయితే పోస్టల్ బ్యాలెట్ ఫలితాలను బట్టి ఎన్నికల ఫలితాల ట్రెండ్ తెలిసిపోనుంది. ఏ పార్టీ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేయబోతుందనేది ఈ ఓట్లే దాదాపు స్పష్టం చేయనున్నాయి. ఈ నేపథ్యంలో తొలిగా వెల్లడికానున్న పోస్టల్ బ్యాలెట్ ఫలితాలపై రాజకీయపార్టీలు ఉత్కంఠతో ఎదురుచూడనున్నాయి. వాస్తవానికి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మొత్తం 18,470 మంది ఉద్యోగులు ఓటు వేశారు. వీటిని లెక్కించడానికి మొత్తం 32 టేబుళ్ల ఏర్పాటు చేస్తున్నారు. తుని నియోజకవర్గంలో 2,206 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు దాఖలవగా వీటి లెక్కింపునకు నాలుగు టేబుళ్లు సిద్ధం చేస్తుండగా రెండు రౌండ్లలో ఫలితాలు వెల్లడించనున్నారు. ఈ నియోజకవర్గంలో బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు నాలుగు గంటల సమయం పట్టనుంది. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 1,760 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పడగా, వీటి లెక్కింపునకు నాలుగు టేబుళ్లు వేస్తున్నారు. ఒక రౌండ్‌లోనే ఫలితాలు వెల్లడికానున్నాయి. ఇందుకు రెండు గంటల సమయం పట్టనుంది. పిఠాపురంలో 2,493 ఓట్లకు 5 టేబుళ్లపై ఒక రౌండ్‌లో కౌంటింగ్ పూర్తికానుంది. కాకినాడ రూరల్‌లో అత్యధికంగా 4,854 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలవగా, అయిదు టేబుళ్లపై రెండు రౌండ్లలో ఓట్లు లెక్కింపు పూర్తి చేయనున్నారు. పెద్దాపురంలో 2,077 ఓట్లకు ఒక రౌండ్, కాకినాడ సిటీలో 3,418 ఓట్లకు రెండు రౌండ్లు, జగ్గంపేట 1,662 ఓట్లకు ఒక రౌండ్‌లో కౌంటింగ్ జరగనుంది. కాకినాడ పార్లమెంట్ పరిధిలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లను సిద్ధం చేస్తుండగా, మూడు రౌండ్లలో ఫలితాలు వెల్లడించనున్నారు. ఇందుకు మొత్తం ఆరు గంటల వ్యవధి పట్టనుంది.

తొలి ఫలితం అక్కడే...

కాకినాడ పార్లమెంట్‌తోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్లను ఏకకాలంలో లెక్కించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కొక్క అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటుచేశారు. 15 నుంచి 19 రౌండ్లలో ఫలితాలు వెల్లడికానున్నాయి. పెద్దాపురం నియోజకవర్గంలో 201 పోలింగ్ బూత్‌ల పరిధిలో 1,76,993 ఓట్లు పోలవగా ఒక్కో రౌండ్‌కు 14 టేబుళ్ల చొప్పున మొత్తం అన్ని బూత్‌ల్లోని ఓట్లను 15 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి చేయనున్నారు. తద్వారా తక్కువ రౌండ్లు ఉండడంతో తొలిగా పెద్దాపురం నియోజకవర్గ పూర్తిస్థాయి అసెంబ్లీ ఫలితాలు వెల్లడవనున్నాయి. ఈ నియోజకవర్గంలో ఈవీఎం ఓట్ల లెక్కింపునకు మూడు గంటల సమయం పట్టనుంది. ఆ తర్వాత ఫలితం తుని నియోజకవర్గం నుంచి వెల్లడికానుంది. ఇక్కడ 224 బూత్‌ల్లో 1,87,215 ఓట్లు పోలయ్యాయి. వీటిని రౌండ్‌కు 14 టేబుళ్ల చొప్పున 16 రౌండ్లలో కౌటింగ్ చేపట్టనున్నారు. అలాగే ప్రత్తిపాడు, కాకినాడ సిటీ నియోజకవర్గాల ఫలితాలు ఏకకాలంలో వెలువడనున్నాయి. కాకినాడ సిటీలో 234 బూత్‌ల పరిధిలో 1,74,366 ఓట్లు పోలయ్యాయి. వీటిని 14 టేబుళ్ల చొప్పున 17 రౌండ్లలో కౌంటింగ్ చేస్తారు. ఇందుకు 4.16 గంటల వ్యవధి పట్టనుంది. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 227 బూత్‌ల్లో 1,74,788 ఓట్లు పోలవగా, 17 రౌండ్లలో కౌంటింగ్ చేపడతారు. పిఠాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో 18 రౌండ్లలో ఫలితాలు వెల్లడికానున్నాయి. పిఠాపురంలో మొత్తం 242 పోలింగ్ బూత్‌ల్లో 2,04,811 ఓట్లు పోలయ్యాయి. వీటిని రౌండ్‌కు 14 టేబుళ్ల చొప్పున మొత్తం 18రౌండ్లలో కౌంటింగ్ చేస్తారు. ఇందుకు 3.10 గంటల వ్యవధి పట్టనున్నట్టు అంచనా వేస్తున్నారు. జగ్గంపేటలో 248 బూత్‌ల్లో 1,92,287 ఓట్లు పోలవగా 18 రౌండ్లలో ఫలితాలు వెల్లడవనున్నాయి. అత్యధికంగా కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 264 బూత్‌ల పరిధిలో 2,01,833 ఓట్లు పోలయ్యాయి. వీటిని లెక్కించడానికి 19 రౌండ్లు పట్టనున్నాయి. అయితే ఈవీఎం ఓట్ల లెక్కింపు ప్రారంభమైన తర్వాత దాదాపు సగం రౌండ్లకే విజేత ఎవరనేదానిపై స్పష్టత రానుంది.

కౌంటింగ్‌కు సిబ్బంది ఇలా...

కౌంటింగ్ ప్రక్రియలో ఒక్కొక్క అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక్కో ఎన్నికల అబ్జర్వర్ ఉంటారు. ఒక ఏఆర్వో, 18 మంది సూపర్‌వైజర్లు, 18 మంది సహాయకులు, 18 మంది మైక్రో అబ్జర్వర్లు ఉంటారు. వీరితోపాటు వివిధ పార్టీల ఎన్నికల ఏజెంట్లు కూడా ఉంటారు. కాగా అసెంబ్లీ ఈవీఎంలతోపాటు ఏకకాలంలో కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరుగుతుంది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఫలితాలు వెలువడిన సమయంలోనే కాకినాడ పార్లమెంట్ ఫలితం కూడా ప్రకటిస్తారు. అలాగే ప్రతి రౌండ్ ఎన్నికల ఫలితాన్ని ఎన్నికల అబ్జర్వర్లు అధికారికంగా ప్రకటించనున్నారు. ఎన్నికల అబ్జర్వర్లు ఫలితాల కాగితంపై సంతకం పెట్టిన తర్వాత మాత్రమే అభ్యర్థుల విజయాన్ని ప్రకటిస్తారు.



కాకినాడ కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జె.నివాస్, ఇతర అధికారులు

ఎన్నికల సంఘం నిబంధనల మేరకే ఓట్ల లెక్కింపు

కలెక్టర్ జె.నివాస్

కలెక్టరేట్(కాకినాడ), మే 23: ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్‌మీనా విజయవాడ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ జె.నివాస్, జేసీ రామ్‌సుందర్‌రెడ్డి, వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో కలిసి హాజరయ్యారు. సాధారణ ఎన్నికలు 2024లో భాగంగా జూన్ 4న నిర్వహించే ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, సిబ్బందికి శిక్షణ, కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు, స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రత, నిఘావ్యవస్థ, కౌంటింగ్ కేంద్రాల్లో కావలసిన ఇతర మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై సీఈవో ముఖేష్‌కుమార్‌మీనా ఈ సందర్భంగా సమీక్షించారు. కలెక్టర్ జె.నివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్వో తిప్పేనాయక్, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, సీపీవో త్రినాథ్ పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పటిష్ట బందోబస్తు.. 144 సెక్షన్ అమలు

ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పటిష్టంగా బందోబస్తు నిర్వహించాలని, కౌంటింగ్ రోజున ప్రణాళిక ప్రకారం ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని కలెక్టర్ జె.నివాస్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ జె.నివాస్, జేసీ రామ్‌సుందర్‌రెడ్డి, ఎస్పీ సతీష్‌కుమార్, వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, పోలీస్, ట్రాఫిక్, రోడ్లు భవనాలశాఖ అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. జూన్ 4న జేఎన్‌టీయూలో నిర్వహించే ఓట్ల లెక్కింపును దృష్టిలో ఉంచుకొని చేపట్టాల్సిన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడ్లు, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టం, డిస్ ప్లేబోర్డులు, అభ్యర్థులు, ఏజెంట్లు, వాహనాల పార్కింగ్ వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేయాలన్నారు. లాఅండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తకుండా పగడ్బందీగా 144 సెక్షన్ అమలుచేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి కార్యాచరణ సిద్ధంచేశామన్నారు. జేఎన్‌టీయూలో తుని, ప్రత్తిపాడు, పిఠాపురం, కాకినాడ రూరల్, కాకినాడ పట్టణం, జగ్గంపేట నియోజకవర్గాల అభ్యర్థులు, ఏజెంట్లు వాహనాల పార్కింగ్ జేఎన్‌టీయూ ఎదురుగా ఉన్న ఐటీఐ, ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోను, పెద్దాపురం నియోజకవర్గానికి స్థానిక జిల్లా క్రీడా మైదానంలో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. డీఆర్వో తిప్పేనాయక్, తుని, ఆర్వో రామలక్ష్మి, ప్రత్తిపాడు ఆర్వో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఎటువైపో..

- ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేవి ఇవే
- జిల్లాలో 18 వేలకు పైబడి ఓట్ల పోలింగ్
- గతంకంటే భారీగా పెరిగిన పోలింగ్ శాతం
- అవి ప్రభుత్వ వ్యతిరేక ఓట్లేనని విశ్లేషణలు

సామర్లకోట, మే23: ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములపై పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కీలకపాత్ర పోషించే అవకాశం ఉంది. స్వల్పతేడా ఓట్లతో గత ఎన్నికల్లో బయటపడినవారు ఈసారి అటుఇటూ కావొచ్చు. జిల్లాలో ఉద్యోగుల్లో అధికశాతం రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసినట్లు చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో ఎవరి భవితవ్యం ఎటు మలుపు తిరుగుతుందో అనే చర్చ ఉద్యోగ వర్గాల్లో విస్తృతంగా సాగుతోంది. నియోజకవర్గాల వారీగా వీరు లెక్కలేసుకుంటున్నారు. గతంలో మాదిరి ఇంటి వద్ద నుంచే పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసే విధానానికి ఈసారి ఎన్నికల కమిషన్ ఫుల్‌స్టాప్ పెట్టింది. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో మాత్రమే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకున్నారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అప్పటి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మొత్తంగా 15 వేలకు పైబడి ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈసారి కాకినాడ జిల్లాలోని కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సిగ్మెంట్లలోనే మొత్తం 18,522 ఓట్లు పోస్టల్ బ్యాలెట్ విధానం ద్వారా వినియోగించుకున్నారు. గతంతో పోల్చితే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్ల సంఖ్య రెట్టింపు అయ్యింది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునే వారిలో ప్రభుత్వోద్యోగులు, అత్యవసర సేవలు అందించేవారు, దేశ రక్షణ విభాగంలో ఉన్న ఓటర్లు, దీర్ఘకాలిక వ్యాధులతో ఎటూ కదలలేని స్థితిలో ఇళ్లకే పరిమితమైనవారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునేందుకు అర్హులుగా ఎన్నికల కమిషన్ నిర్దేశించింది. ఆ కోవలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో నియోజకవర్గాల వారీగా కాకినాడ రూరల్ నుంచి అత్యధికంగా 4,829 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకున్నారు. అత్యల్పంగా జగ్గంపేట నియోజకవర్గం నుంచి 1,635 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. తుని నుంచి 2,176, ప్రత్తిపాడు నుంచి 1,778 మంది, పిఠాపురం నుంచి 2,464 మంది, పెద్దాపురం నుంచి 2,074 మంది కాకినాడ సిటీ నుంచి 3,566 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. వీరిలో ప్రభుత్వోద్యోగులు 14,463 మంది కాగా, ఇతర జిల్లాలకు చెందినవారు 2,930 మంది, అత్యవసర సర్వీసుల్లో ఉన్నవారు 404 మంది, ఇళ్ల వద్దే బెడ్‌పై ఉంటూ ఎటూ కదలలేని వారు 607 మంది, దేశ రక్షణ విభాగంలో పనిచేస్తున్నవారు 58 మంది ఉన్నారు. గత ఎన్నికల్లో ఉద్యోగులందరూ కూడా తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేశారన్న అభిప్రాయం ఉంది. ఈసారి ప్రస్తుత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసినట్టు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. 2019లో తక్కువ ఓట్ల శాతంతో గెలిచిన అభ్యర్థులకు ఈసారి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వారికి వ్యతిరేకంగా పడినట్టు తెలుస్తోంది. దీనివల్ల కొద్ది పాటి ఓట్ల తేడాతోనూ కొందరి భవితవ్యం తారుమారు కావొచ్చునని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు పరిశీలన

కలెక్టరేట్ (కాకినాడ), మే23: జేఎన్‌టీయూకేలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ నివాస్, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్ రెడ్డిలు గురువారం పరిశీలించారు. అనంతరం స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రతను వారు పరిశీలించారు.

జేఎన్‌టీయూకేలో కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ

పారదర్శంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణ : రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ నివాస్

కలెక్టరేట్(కాకినాడ), మే23: ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. ఓట్ల లెక్కింపునకు మూడు రోజుల ముందే కౌంటింగ్ ఏజెంట్ల వివరాలు అందజేయాలన్నారు. గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నేపథ్యంలో జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులు, కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీచేసిన అభ్యర్థులతో కలెక్టర్ జె.నివాస్.. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. అభ్యర్థులు, ఏజెంట్లు ఓట్ల లెక్కింపు ప్రక్రియకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కౌంటింగ్ వివరాల నమోదు, కౌంటింగ్ కేంద్రాల్లో అనుసరించాల్సిన విధానం, స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, అభ్యర్థులు, ఏజెంట్లు వాహనాల పార్కింగ్ తదితర అంశాలకు సంబంధించి జిల్లా అధికార యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్ల వివరాలను వీరిద్దరూ రాజకీయ పార్టీల ప్రతినిధులకు, అభ్యర్థులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు 2024 ప్రక్రియలో తుది ఘట్టం అయిన ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని జూన్ 4న పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు కాకినాడ జేఎన్‌టీయూలో అన్ని రకాల భద్రతా చర్యలను చేపట్టడం జరిగిందన్నారు. మే 13న పోలైన ఈవీఎంలను జేఎన్‌టీయూలోని వివిధ బ్లాక్‌లో వద్ద స్ట్రాంగ్ రూమ్‌ల్లో అత్యంత సురక్షితంగా భద్రపరచడం జరిగిందన్నారు. కౌంటింగ్ రోజున ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 6 గంటలకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి అభ్యర్థులు, ఏజెంట్లతోపాటు సెల్‌ఫోన్‌ను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించడం జరగదన్నారు. ఫలితాలు రౌండ్లు వారీగా రిటర్నింగ్ అధికారులు వెల్లడిస్తారన్నారు. ఫలితాలు వెలువడిన తర్వాత రాజకీయ పార్టీలు ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడానికి అనుమతి లేదన్నారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉంటుందని, 144 సెక్షన్ అమలు చేయడం జరుగుతుందని చెప్పారు.

నేటి నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

జిల్లాలో హాజరుకానున్న 7915 మంది విద్యార్థులు.. 29 కేంద్రాల్లో నిర్వహణ

కాకినాడ రూరల్, మే 23: పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభం కానున్నాయని జిల్లా డీఈవో పి.రమేష్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 29 కేంద్రాల్లో నిర్వహించే పరీక్షలకు 7,915 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకూ జరుగుతాయని, విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు నిర్ణీత సమయానికి చేరుకోవాలని, జూన్ 3 వరకూ ఈ పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. మొదటి రోజు తెలుగు పరీక్ష ఉందన్నారు. ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాల షెడ్యూల్ వాయిదా

కలెక్టరేట్ (కాకినాడ), మే23: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో శుక్రవారం, శనివారం జరగాల్సిన ప్రవేశాల కౌన్సెలింగ్ తాత్కాలికంగా వాయిదా వేసినట్టు ఆ సంస్థ జిల్లా సమన్వయ అధికారి వెల్లడించారు.

ఏసీబీ అరెస్టు చేసిన అధికారికి రిమాండ్

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): అవినీతి అభియోగాలపై ఏసీబీ అరెస్టు చేసిన అధికారికి కోర్టు రిమాండ్ గురువారం విధించింది. కాకినాడ జిల్లా పరిశ్రమల శాఖలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న తమిడి మురళీ(61)ని 22న ఏసీబీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. రాజమండ్రి ఏసీబీ స్పెషల్ కోర్టులో అయనను ప్రవేశపెట్టగా జూన్ 5 వరకూ కోర్టు రిమాండు విధించిందని ఏసీబీ అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

మూడేళ్లుగా పామాయిల్ రైతులను పీడిస్తున్న తెల్లదోమ వైరస్

- ఎకరానికి పది నుంచి ఐదుకి పడిపోయిన దిగుబడులు
- గిట్టుబాటు ధర లేక నష్టాలు ఎదుర్కొంటున్న రైతులు

గండేపల్లి, మే23: గత మూడు సంవత్సరాలుగా పామాయిల్ రైతులకు తెల్లదోమ వైరస్ తెగులు శాపంగా మారింది. ఒకపక్క ధర లేకపోవడంతో దిగుబడి కూడా కోల్పోయి రైతులు నష్టాలు ఎదుర్కొంటున్నారు. మూడేళ్ల కిందట ఎకరానికి 8 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వచ్చేది. తెల్లదోమ సోకవడంతో క్రమక్రమంగా దిగుబడి తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం ఎకరానికి 4 నుంచి 5 టన్నులు అవ్వడానికి కష్టంగా ఉందని రైతులు తెలుపుతున్నారు. ఎన్ని మందులు పిచ్‌కారి చేసినా తెల్లదోమ వైరస్ తెగులును నివారించలేకపోతున్నామంటున్నారు. అధికారుల సూచనలు తీసుకుంటుంటే ఒకేసారి అన్ని తోటలకు మందు పిచికారి చేస్తేనే తెగులు నివారించగలుగుతున్నామంటున్నారు. అయితే కొద్దిమంది పిచ్‌కారి చేసి మరికొద్దిమంది చేయకపోతే మళ్లీ వైరస్ విజృంభించే అవకాశముంది. గతంలో ఆయిల్‌పామ్ లాభదాయకంగా ఉండడంతో రైతులు తోటలు వేసేందుకు ఆసక్తి చూపేవారు. అయితే తెల్లదోమ సోకినప్పటి నుంచి దిగుబడి లేక రైతులు తీవ్ర నష్టాలపాలవడంతో పామాయిల్ తోటలు వేసేందుకు రైతులు వెనుకడుగు వేస్తున్నారు. ఇదిలా ఉంటే కొంతకాలం కిందట పామాయిల్ టన్ను ధర సుమారు రూ.23 వేల వరకు కొన్ని రోజులు నిలకడగా పలకడంతో ఆ సమయంలోనే తోటలు కూడా ఎక్కువ వేయడంతోపాటు కౌలు రైతులు ఎకరం లక్షకు నాలుగైదు సంవత్సరాలకు కౌలు కట్టి తీసుకున్నారు. అయితే పెరిగిన ధర ఒక సంవత్సరం కూడా నిలబడకుండా క్రమక్రమంగా దిగుతూ రూ.11,800కు చేరుకుని మళ్లీ పెరిగి ప్రస్తుతం రూ.14,090 ధరకు వచ్చింది. దీంతో కౌలు రైతులు కూడా పెట్టిన పెట్టుబడి లేక నష్టాలు ఎదుర్కొంటున్నారు. పామాయిల్ సాగుకు ఎకరానికి సుమారు రూ.50 వేలు నుంచి 60 వేల పెట్టుబడి అవుతుందని, అయితే ప్రస్తుతం తెల్లదోమ వల్ల ఐదు టన్నులు దిగుబడి రావడంతో పెట్టిన పెట్టుబడి రావడం కూడా గగనమైందంటున్నారు. తెల్లదోమ ప్రభావం పూత, పిందె సమయంలో ఉన్నప్పుడు తెల్లదోమ ఆకుల్లో ఉన్న తేమ పీల్చేయడంతో వైరస్ సోకి పుష్టిగా ఉన్న గెలలు గిడసబారిపోయి దిగుబడి తగ్గిపోతుంది. ప్రభుత్వం నుంచి రాయితీలు వచ్చేవని వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ సాయం కూడా లేదని రైతులు చెపుతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఎకరానికి రూ.50 వేలు వరకు నష్టం చూడాల్సి వస్తుందని రెండు సంవత్సరాలుగా ఇలాగే నష్టాలు ఎదుర్కొంటున్నామని కౌలు రైతులు చెప్పారు. కౌలు రైతు పరిస్థితి కుడిలో పడ్డ ఎలుకలా మారింది. లాభాలు బాటిన పట్టిన ఆయిల్ ఫామ్ ప్రస్తుతం నష్టాల్లో ముంచింది. సొంత రైతులకు లాభాలు రాకపోయినా పెట్టుబడులు అయినా వస్తున్నాయి. కౌలు రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. గండేపల్లి మండలంలో సుమారు 12500 ఎకరాల్లో ఆయిల్‌ఫామ్ సాగు చేస్తున్నారు.





తెగులు సోకి గెలలు కాయకుండా ఉన్న తోట

రూ.18 వేలుంటేనే గిట్టుబాటు



టన్ను రూ.18 వేలు ఉంటేనే గిట్టుబాటవుతుంది. తెల్లదోమ నివారణ కావడంలేదు. వైరస్ నివారణకు ఏం చేయాలో తెలియని పరిస్థితి. తీవ్రంగా నష్టపోయాం. పెట్టిన పెట్టుబడులే తప్ప లాభాలు లేవు. **- గురజాల వెంకన్నదొర, మురారి**

పూర్తిగా నష్టాల్లో మునిగా

టన్ను రూ.23 వేలు పలుకుతున్న సమయంలో పదెకరాలు కౌలుకు తీసుకున్నా. ఆ ధర ఎంతోకాలం నిలబడలేదు. ప్రస్తుతం సుమారు రూ.14 వేల ధర పలుకుతోంది. వచ్చిన ఆదాయం కౌలుకు వస్తుంది. ఎకరాలకు రూ.50 వేల నష్టం వస్తుంది. రెండు సంవత్సరాల నుంచీ అదే పరిస్థితి. **- పిల్లా సత్తిబాబు, మల్లేపల్లి**



వైభవంగా చక్రస్నానం

అన్నవరంలో నేడు శ్రీపుష్పయాగం - 7లో

రవాణాశాఖలో సిటిజన్ వెబ్‌సైట్ సేవలు నిలిపివేత

- ఆ స్థానంలో కొత్త వెబ్‌సైట్ ప్రారంభించిన ప్రభుత్వం
- సర్వర్ ప్రాబ్లంతో వాహనదారులకు ఇబ్బందులు

కార్పొరేషన్ (కాకినాడ), మే23: రవాణాశాఖకు సంబంధించిన అన్ని రకాల పౌరసేవలు 2018 నుంచి ప్రభుత్వం ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చింది. ఎటువంటి సేవలు పొందాల్సి ఉన్నా, కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేకుండా ఎల్ఎల్ఆర్, డీఎల్ఎఫ్‌సీ వంటి సేవలకు మాత్రమే కార్యాలయానికి రావాల్సి వచ్చేది. ఆన్‌లైన్‌లోనే అనుమతులిచ్చేవారు. ఈ పౌర సేవలను సిటిజన్ వెబ్‌సైట్ ద్వారా నిర్వహించేవారు. అయితే ఈ వెబ్‌సైట్‌ను బుధవారం సాయంత్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో రవాణాశాఖ సేవలన్నీ నిలిచిపోవడంతో పలు ఇబ్బందులు ఎదురయ్యాయి. గురువారం సర్వర్ మొరాయించడంతో ఈ సమస్య మరింత ఎక్కువైంది. రవాణాశాఖ కార్యాలయానికి వచ్చిన వారంతా గంటలు తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం గత రెండేళ్లుగా ఈ వెబ్‌సైట్‌ను నిలిపివేయాలని ప్రణాళిక చేసినప్పటికీ అలా జరగలేదు. దీంతో ఉన్నట్టుండి వెబ్‌సైట్‌ను నిలిపివేయడంతో వాహనదారులు ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. ఆ స్థానంలో ఆలిండియా సర్వర్ (వాహన వెబ్ సైట్) ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ వెబ్‌సైట్ సిబ్బందికి అలవాటులేని కారణంగా అలవాటు అయ్యేంతవరకు సిబ్బందికి ఇబ్బందులు తప్పేలా లేవు. ప్రభుత్వం నిర్ణయం వల్ల రవాణా శాఖలోని పౌర సేవలకు సమస్యలు తలెత్తాయి.

వైభవంగా చక్రస్నానం



చక్రస్నాన మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అన్నవరం, మే 23: కోరిన కోర్కెలు తీర్చే కలియుగ దైవంగా పూజలందుకుంటున్న అన్నవరం సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలలో భాగంగా గురువారం పంపా సరోవరం వద్ద చక్రస్నానం కార్యక్రమం వేడుకగా జరిగింది. ఉదయం 9 గంటలకు నవ దంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను, పెండ్లిపెద్దలైన సీతారాములను మేళతాళాలు, పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ పంపాతీరం వద్దనున్న ప్రత్యేక వేదిక వద్దకు తీసుకుని వచ్చారు. ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పంపా సరోవరంలో కృత్రిమంగా తీర్చిదిద్దిన కోనేరు వద్దకు తీసుకుని వచ్చి స్వామి,అమ్మవార్లను, త్రిశూలం, సుదర్శన చక్రంతో ముమ్మారు స్నానమాచరింపచేశారు. తిరిగి వేదిక వద్దకు తీసుకెళ్లి పూజలనంతరం చతుర్వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా కంకణ విమోచన గావించారు. కార్యక్రమంలో ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ ఐ.వి రోహిత్ తదితరులు పాల్గొన్నారు.



నవదంపతులను ఎత్తుకుని నృత్యం..

ఉల్లాసంగా నాకబలి, దండియాడింపు

సాయంత్రం 4 గంటలకు అనివేటి మండపంలో నాకబలి, దండియాడింపు కార్యక్రమాలు ఉల్లాసంగా జరిగాయి. అమ్మవారికి నల్లపూసలు గుచ్చి వసంతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ముందుకు సాగారు. అర్చకస్వాములు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఎత్తుకుని నృత్యం చేశారు. దేవస్థానం పీఆర్వో కృష్ణారావు, సూపరింటెండెంట్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీపుష్పయాగం

సత్యదేవుడికి క్రోధి నామసంవత్సర దివ్య కల్యాణోత్సవాలు శుక్రవారం రాత్రికి జరిగే శ్రీపుష్పయాగంతో ముగియనున్నాయి. రాత్రి 7 గంటలకు స్వామివారి నిత్య కల్యాణ మండపంలో ఈ వేడుకను నిర్వహిస్తారు. వివిధ సుగంధ భరిత పుష్పాలతో నవ దంపతులను అర్చించి విశేష పదార్థాలను నివేదిస్తారు. అనంతరం దంపతీ తాంబూలాలు అందించి మహిళలకు రవిక వస్త్రాలు బహూకరిస్తారు.



ప్రత్యేక వేదికపై పూజలు నిర్వహిస్తున్న పండితులు

సాగర తీరాన విశేష పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సర్పవరం జంక్షన్, మే 23: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి కల్యాణ మహోత్సవాలు గత ఏడు రోజులుగా వేలాది మంది భక్తుల నడుమ అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. గురువారం స్వామివారి చక్రస్నానం ఘట్టంలో భాగంగా ఆలయ పండితులు మంత్రోచ్ఛరణలతో పూర్తి శాస్త్రోక్తంగా పలు రకాల విశేష పూజలు నిర్వహించారు. విశేషాలంకరణలో దర్శనమిచ్చిన శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి విగ్రహం, చక్ర పెరుమాళ్లను చినశేషవాహనంపై ఉంచారు. వేలాది మంది భక్తులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్పవరం నుంచి ఊరేగింపుగా తోడ్కొని సూర్యారావుపేట సాగర తీరానికి తీసుకెళ్లారు. అక్కడ స్వామివారికి శాస్త్రోక్తంగా పూజలు, చక్ర పెరుమాళ్లకు పూజలు, అభిషేకాలు, అర్చనలు, నీరాజనాలు, పలు రకాల విశేష ద్రవ్యాలతో పూజలు చేశారు. భక్తుల గోవింద నామ స్మరణతో అత్యంత భక్తిశ్రద్ధలతో సముద్రంలో స్నానం ఆచరించిన అనంతరం స్వామివారి చక్రస్నానంలో పాల్గొన్నారు. బీచ్‌లో పాల్గొన్న భక్తులకు దాతల ఆధ్వర్యంలో పులిహోర, చక్రపొంగలితో పాటు మజ్జిగ, పానకం పంపిణీ చేశారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేకంగా టెంట్‌లో వసతి కల్పించడం పట్ల మహిళా భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. సాయంత్రం పుష్ప వాహనంపై స్వామివారి తిరువీధి ఉత్సవం, గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జొన్నాడ భీమశంకరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

కృష్ణబాబు మృతికి ప్రముఖుల సంతాపం



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రఘురామకృష్ణంరాజు

కొవ్వూరు, మే 23 : కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు) మృతి వార్త తెలిసిన వెంటనే పలువురు ప్రముఖులు, పార్టీలకతీతంగా దొమ్మేరు విచ్చేసి కృష్ణబాబు సోదరులు ది ఆంధ్ర సుగర్స్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాథ్‌చౌదరి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు)లతో పాటు కుమారుడు రవిబాబు, అల్లుడు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, కృష్ణబాబు కుటుంబ సభ్యులను కలిసి సంతాపం వ్యక్తం చేశారు. కృష్ణబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువారం మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రఘురామకృష్ణంరాజు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు కృష్ణబాబుకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గ కూటమి ఉమ్మడి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో జైలు

కాకినాడ క్రైం మే 23 చిట్స్ పాటలకు సంబంధించి చిట్ కట్టించుకుని తిరిగి డబ్బులు ఇవ్వకుండా మోసగించిన ఇద్దరి నిందితులపై నేరం రుజువు కావడంతో కాకినాడ రెండో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.ప్రసన్నలక్ష్మి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 10 వేల జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడకు చెందిన పైలా నాగేశ్వరరావు, పైలా పవన్‌కుమార్ కలిసి కాకినాడ అపోలో ఆసుపత్రి సమీపంలో దుర్గా, రాధిక చిట్స్ ప్రైవేటు లిమిటెడ్ అనే సంస్థను నడిపేవారు. ఈ క్రమంలో స్థానిక జగన్నాథపురానికి చెందిన కాలే సత్య వీరలక్ష్మి అనే మహిళతో 2016 లో చిట్ వాయిదాల రూపంలో రూ. 10 లక్షలు కట్టించుకున్నారు. అన్ని వాయిదాలు కట్టించుకున్న అనంతరం సత్య వీరలక్ష్మికి డబ్బు తిరిగి ఇవ్వకుండా కాలయాపన చేస్తూ తప్పించుకుని తిరగడంతో ఆమె మోసపోయానని గ్రహించింది. అనంతరం బాధితురాలు స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి నిందితులిరువురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం కోర్టులో జరిగిన వాదోపవాదనల్లో నిందితులపై నేరారోపణ రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గోసాల కమలకుమారి వాదనలు వినిపించారు.

పోలీసులు హద్దులు మీరితే..ఫిర్యాదు చేయండి

పైసా ఖర్చులేదు.. 6 నెలల్లో పరిష్కారం

పోలీసు కంప్లైంట్స్ అథారిటీ చైర్మన్ విశ్వనాథం



మీడియాతో మాట్లాడుతున్న అథారిటీ చైర్మన్ విశ్వనాథం

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): పోలీసులు విధులు దుర్వినియోగం చేసిన సందర్భాల్లో వారిపై పోలీసు కంప్లైంట్స్ అథారిటీకి బాధితులు లేదా వారి సంబంధీకులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే తగు చర్యలు తీసుకుంటామని అథారిటీ చైర్మన్, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి ఆర్‌జే విశ్వనాథం చెప్పారు. రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరులోని అథారిటీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. కాకినాడ, తూర్పుగోదావరి, డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల పరిధిలోని కానిస్టేబుళ్ల దగ్గర నుంచి డీఎస్పీ స్థాయి వరకూ వచ్చే ఫిర్యాదులపై విచారణ చేపట్టే అధికారం రాజమహేంద్రవరం కేంద్రంగా పనిచేస్తున్న అథారిటీకి ఉందన్నారు. గుంటూరులో ఉన్న రాష్ట్రస్థాయి అథారిటీకి ఎస్పీ నుంచి డీజీ వరకూ అధికార పరిధి ఉందన్నారు. తమ పరిధిలోని ఏదైనా జిల్లాకు సంబంధించి ఎక్కువగా ఫిర్యాదులు వస్తే అక్కడికే వెళ్లి విచారణ చేపడతామని చెప్పారు. ఫిర్యాదుదారులు dpcarajamahendravaram@gmail.com మెయిల్ ద్వారా లేదా 99484 64363 నెంబరుకు వాట్సాప్ ద్వారా లేదా పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ, వైటీసీ, బొమ్మూరు, రాజమహేంద్రవరం రూరల్‌కు రిజిస్టరు పోస్టు ద్వారా తమ అర్జీలను పంపించవచ్చని తెలిపారు. తమ కార్యాలయానికి వచ్చి నేరుగా సమస్యను తెలిపి ఫిర్యాదు అందజేయవచ్చన్నారు. కస్టడీలో మరణించడం, అత్యాచారం, కస్టడీలో తీవ్ర గాయాలు కావడం, భూ కబ్జాలు, సివిల్ తగాదాల్లో కల్పించుకోవడం, ప్రాథమిక హక్కులను ఉల్లంఘించి వ్యక్తులను ఇబ్బంది పెట్టడం వంటి వాటిపై ఘటన జరిగిన రోజు నుంచి ఏడాది లోపుగా తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. దీనికి ఎలాంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. గరిష్టంగా ఆరు నెలలలోపుగా విచారణ పూర్తి చేసి సదరు ఉద్యోగి విధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని రుజువైతే చర్యలకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. పోలీసులపై ఫిర్యాదు చేస్తే వారితో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్న భయం అవసరం లేదన్నారు. అథారిటీ ఏర్పాటైన తర్వాత 14 ఫిర్యాదులపై విచారణ జరిపి 10 కేసులకు పరిష్కారం చూపించామన్నారు. 4 కేసుల విచారణ వివిధ దశల్లో ఉందన్నారు. అథారిటీపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అథారిటీ సభ్యులు విశ్రాంత స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎం.జితేంద్ర, విశ్రాంత అడిషనల్ ఎస్పీ బి.లక్ష్మీనారాయణ, సీనియర్ న్యాయవాది సీహెచ్ మన్మథరావు పాల్గొన్నారు.

ముగిసిన ఇంజనీరింగ్ పరీక్షలు

జేఎన్టీయూకే, మే 23: ఏపీఈఏపీసెట్-2024 ఆన్‌లైన్ ఇంజనీరింగ్ విభాగం ప్రవేశ పరీక్షలు గురువారం ఉదయం సెషన్‌తో ప్రశాంతంగా ముగిసినట్లు సెట్ చైర్మన్, వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. కాకినాడ జిల్లాలోని 5పరీక్షా కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన పరీక్షకు 930 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 895 మంది హాజరయ్యారని 35 మంది గైర్హాజరు కాగా మొత్తం 96.24 శాతం హాజరు నమోదైందన్నారు. అదే విధంగా తూర్పుగోదావరి జిల్లాలోని ఒక పరీక్షా కేంద్రంలో 697 మంది, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఒక పరీక్షా కేంద్రంలో 340 మంది హాజరయ్యారన్నారు. అగ్రికల్చర్, ఫార్మసీకి సంబంధించిన పరీక్ష ప్రాథమిక కీ ని వీసీ విడుదల చేశారు. రెస్పాన్స్ షీట్స్‌ను వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు చెప్పారు. ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటల వరకూ ప్రాథమిక కీ పై విద్యార్థులకు అభ్యంతరాలుంటే తెలియచేయవచ్చన్నారు. అదే విధంగా ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన పరీక్షల ప్రాథమిక కీ ని శుక్రవారం ఉదయం 10 గంటలకు విడుదల చేస్తామని ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటల వరకూ ప్రాథమిక కీ పై విద్యార్థులకు అభ్యంతరాలుంటే తెలియచేయవచ్చని కన్వీనర్ ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. అంతే కాకుండా ఏపీఈఏపీసెట్ ప్రవేశ పరీక్షకు సంబంధించి 25 శాతం వెయిటేజీ మార్కులను ఇంటర్మీడియట్ మార్కుల ఆధారంగా తీసుకోనున్న నేపథ్యంలో ఏపీ రెగ్యులర్ ఇంటర్ విద్యార్థులు కాకుండా ఇతర బోర్డులకు చెందిన 10+2 విద్యార్థులు తమ మార్కులను ఏపీఈఏపీసెట్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని వాటి ద్వారా వారికి ర్యాంకులు కేటాయించనున్నట్లు కన్వీనర్ సూచించారు. విద్యార్థులకు ఎటువంటి సందేహాలున్నా 0884 2359599, 2342499 ఫోన్ నెంబర్లలో గానీ, helpdeskapeapcet@apsche.org మెయిల్ ఐడీ ద్వారా గానీ సంప్రదించాలన్నారు.

హత్యాయత్నం కేసులో జైలు

కాకినాడ క్రైం మే 23 కానిస్టేబుల్ పై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఇద్దరు నిందితులపై నేరం రుజువు కావడంతో కాకినాడ రెండో అదనపు అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎన్.విజయబాబు మూడు సంవత్సరాల మూడు నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ కొండయ్యపాలెంలో 2020లో ఏఆర్ కానిస్టేబుల్ రాములకొండ బాలరెడ్డిని ఆ ప్రాంతానికి చెందిన వీధి సుబ్రహ్మణ్యం, సవలం పవన్‌కుమార్, యానం సత్యభవాని శంకర్‌లు కలిసి చాకుతో పొడిచారు. అనంతరం బాలరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు నిందితులు ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టులో జరిగిన వాదోపవాదనల అనంతరం నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అయితే నిందితుల్లో వీధి సుబ్రహ్మణ్యం ఇప్పటికే హత్యకు గురి కావడంతో పవన్‌కుమార్, భవాని శంకర్‌లకు న్యాయమూర్తి శిక్షను ఖరారు చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డేనియల్ దినకర్ జేసన్ వాదనలు వినిపించారు.

సాదాసీదాగా జడ్పీ సమావేశం



జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరుగుతున్న సమావేశం



హాజరైన జడ్పీటీసీ సభ్యులు

కాకినాడ సిటీ, మే 23 : సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిబంధనలకు లోబడి ఏ విధమైన శాఖాపర సమీక్షలు, తీర్మానాలు చేయకుండా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం, స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించారు. గురువారం కాకినాడలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జడ్పీ సర్వసభ్య సమావేశం, 1,2,4,7 స్థాయీ సంఘ సమావేశాలకు జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షత వహించారు. అదే విధంగా 3వ స్థాయీ సంఘ సమావేశానికి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, ఐదో స్థాయీ సంఘ సమావేశానికి స్థాయీ సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, 6వ స్థాయీ సంఘ సమావేశానికి జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత అధ్యక్షత వహించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో జీఎస్ రాంగోపాల్, జడ్పీటీసీ సభ్యులు, ఆయా జిల్లాల వివిధ శాఖల అధికారులు, జిల్లా పరిషత్ పరిపాలనాధికారులు పాల్గొన్నారు.

ఏలేరు కాలువలో పడి వ్యక్తి మృతి

రౌతులపూడి, మే 23: కాకినాడ జిల్లా రౌతులపూడి గ్రామశివారున బుధవారం ఏలేరు కాలువలో పడి గల్లంతైన వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ అబ్దుల్ నబీ తెలిపిన వివరాల ప్రకారం... గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన సికోలు వీరబాబు బుధవారం రౌతులపూడిలో ఓ శుభాకార్యానికి వచ్చి తిరిగి వెళ్తున్న సమయంలో ఏలేరు కాలువలో స్నానానికి దిగి గల్లంతయ్యాడు. గురువారం మధ్యాహ్నం వీరబాబు మృతదేహాన్ని గుర్తించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

FLAT FOR SALE

నిడదవోలు, గాంధీనగర్, లయన్స్ కంటి ఆసుపత్రి రోడ్ సూర్య రెసిడెన్సీ నందు డబుల్ బెడ్‌రూం ఫ్లాట్ E/F అమ్మకమునకు కలదు. 25L Negotiable Contact no : **9441037735.**

Ajd:177192

కావలెను

★ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000. సంప్ర॥ 8374272245.

AJV_192818

EDUCATION

▸▸ మంచి ఉద్యోగం కావాలా? చదవండి **B.Sc.** ఫోరెన్సిక్ సైన్స్ / అగ్రికల్చర్ / డైరీ సైన్స్ / AI & ML; BBA; B.Voc. మెడికల్ ఇమేజింగ్ . అడ్మిషన్లకై సంప్ర : **84658 74867,** మేరీ స్టెల్లా కాలేజ్, విజయవాడ.

AJB - 182328

WANTED

★ టెలీకాలర్స్ కావలెను విద్యార్హతతో సంబంధం లేదు. ఫోన్లో స్పష్టంగా మాట్లాడగలిగి విషయాన్ని అర్థం చేయించగలిగిన వారు వెంటనే సంప్రదించగలరు ఆకర్షణీయమైన జీతం మరియు ఇన్సెంటివ్ ఇవ్వబడును. Raja Ratna Group Ramachandrapuram **Ph: +91 9346866544** AJH-002382

4 Lines CLASSIFIED Rs.230/- Only

త్రుటిలో తప్పిన ప్రమాదం



వరుపుల కారు ఢీకొనడంతో దెబ్బతిన్న మరో వాహనం

పిఠాపురం బైపాస్ రోడ్డులో రెండు కార్లు ఢీ

ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావుకు స్వల్పగాయాలు

పిఠాపురం/ప్రత్తిపాడు, మే 23: కాకినాడ జిల్లా పిఠాపురం బైపాస్‌రోడ్డులో రెండు కార్లు ఢీకొన్న సంఘటనలో ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావుతో పాటు పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. రెండు కార్లల్లో బెలూన్లు తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. తొండంగి మండలం బెండపూడి గ్రామానికి చెందిన బెండపూడి గురువు కుమార్తె అల్లూరి సీతామహాలక్ష్మి కారులో కాకినాడ వెళుతున్నారు. పిఠాపురం బైపాస్‌రోడ్డులో పెట్రోల్‌బంకు ఎదురుగా ఉన్న టీపాయింట్ వద్దకు వచ్చేసరికి గేదెలు అడ్డుగా రావడంతో కారును స్లో చేశారు. అదే సమయంలో ఏలేశ్వరం మండలం లింగంపర్తి నుంచి కాకినాడ వెళుతున్న ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు కారు వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు కార్లు దెబ్బతిన్నాయి. రెండు వాహనాల్లో బెలూన్లు తెరుచుకోవడంతో మాజీ ఎమ్మెల్యే వరుపుల సహా పలువురు అతి స్వల్పగాయాలతో బయటపడ్డారు. వరుపుల వెంటనే మరో వాహనంలో కాకినాడ వెళ్లిపోయారు. వాహన డ్రైవర్లు సుంకర రాజేష్, గుండం నాగేశ్వరరావులకు స్వల్పంగా గాయాలయ్యాయి. రెండు వాహనాల్లోని వారు కాకినాడకు వెళ్లిపోయినట్లు పోలీసులు చెబుతున్నారు. హైవే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఇదిలా ఉంటే తాను క్షేమంగానే ఉన్నానని, అభిమానులు, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కాకినాడ ఎవరూ రావద్దని వరుపుల సుబ్బారావు ఓ వీడియో సందేశం పంపారు.



దెబ్బతిన్న మాజీ ఎమ్మెల్యే వరుపుల కారు

ఆదుర్రులో బుద్ధ పౌర్ణమి వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న నాయకులు

మామిడికుదురు, మే 23: ఆదుర్రులో బుద్ధ పౌర్ణమి వేడుకలను గురువారం బుద్ధ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదుర్రులోని ఆది బౌద్ధ స్థూపం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బుద్ధుని జీవిత విశేషాలతో కూడిన పాటలను ఆలపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంపవేమా, బుద్ధవిహార్ ట్రస్టు కార్యదర్శి ఎస్ఎస్ఆర్ భూపతి మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు నడిచిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. కార్యక్రమంలో మెండా ఆదినారాయణ, బయ్యా మోహన్, అడపా వెంకటరత్నం, బళ్ల శ్రీనివాసరావు, పులపర్తి కృష్ణ, యర్రంశెట్టి తాతబుజ్జి తదితరులు పాల్గొన్నారు.



హిజ్రాల వేషధారణలో బ్లేడ్‌బ్యాచ్ దందాలు

రాజమహేంద్రవరం రూరల్, మే 23: రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామం శివారు గామన్ బ్రిడ్జి రోడ్డులో అర్ధరాత్రి దాటాక బ్లేడు బ్యాచ్‌ల ఆగడాలు మితిమీరుతున్నాయి. గత కొద్ది రోజులుగా కొన్ని బ్యాచ్‌లు గామన్ బ్రిడ్జి దిగువన గోదావరి గట్టు వద్దకు చేరి మద్యం మత్తులో రోడ్డుపైకి వచ్చి అటుగా వెళ్లే వాహనాలకు అడ్డంగా నిలబడి దందాలు చేస్తున్నారు. బ్లేడులు, కత్తులు, బీరు సీసాలు చేతపట్టుకుని భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. గత అర్ధరాత్రి ఈ బ్యాచ్‌లలో రెండు వర్గాలకు గొడవలు జరిగి రోడ్డుపై రాడ్‌లతో కొట్టుకుని దారుణంగా వ్యవహరించారని అటుగా లారీలో వెళ్లిన ఒక డ్రైవర్ తెలిపారు. లారీ ఆపి కిందకు దిగితే దాడి చేస్తారనే భయపడి ఆపకుండా వెళ్లిపోయినట్టు ఆ డ్రైవర్ చెప్పాడు. కొంత మంది యువకులు హిజ్రాల వేషధారణలో తిరుగుతున్నట్లుగా కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదే విధంగా కాతేరు గ్రామంలో మెయిన్ రోడ్డు, మల్లయ్యపేట, గణపతినగర్, ఆనంద్ నగర్ రోడ్డు, శాంతి నగర్ రోడ్డు ప్రాంతాల్లో కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి దాటాక బైక్‌లు, స్కూటీలు వేసుకుని ఇనుప రాడ్‌లు, బ్లేడ్‌లు పట్టుకుని మత్తులో తిరుగుతున్నారని వారిని ఎవరని నిలదీస్తే దాడి చేసే పరిస్థితి ఉండడంతో ఎవరూ కూడా బయటకు రావడం లేదు. మత్తులో బ్లేడ్ బ్యాచ్‌లు, హిజ్రాల వేషాదారణతో కొంత మంది, బైక్‌లు దొంగతనాలు చేసేందుకు మరికొంత మంది ఇలా తిరగడంతో ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటున్నాయి.

IDBI BANK | NPA మేనేజ్‌మెంట్ గ్రూప్, హైదరాబాద్, నం. 5-9-89/1&2, 2వ అంతస్తు, చాపెల్ రోడ్ బ్రాంచ్, హైదరాబాద్-500 001. వెబ్‌సైట్: www.idbibank.in, CIN: L65190MH2004GOI148838 | అమ్మకం ప్రకటన

స్థిరాస్తుల అమ్మకం కొరకు బహిరంగ ప్రకటన

అనుబంధం-IV-A (రూల్ 9(1) నిబంధన చూడండి)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 9(1) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన. సెక్యూర్డ్ క్రెడిటార్, ఐడీబీఐ బ్యాంక్ లిమిటెడ్ అధీకృత అధికారి ద్వారా వాస్తవిక స్వాధీనం చేసుకోబడినట్టి సెక్యూర్డ్ క్రెడిటారుకు తనఖా పెట్టబడినట్టి దిగువ వివరించిన ఆస్తులు శ్రీ కృష్ణ స్టోక్స్ అండ్ ట్రేడర్స్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ తోట కన్నా రావు మరియు శ్రీమతి తోట వెంకట రమణ నుండి సెక్యూర్డ్ క్రెడిటార్ ఐడీబీఐ బ్యాంక్ లిమిటెడ్‌కు బకాయి ఉన్న 01 అక్టోబర్ 2017 నుండి వర్తింపుతో రూ.31,39,94,392/- (రూపాయలు ముప్పై ఒక్క కోట్ల ముప్పై తొమ్మిది లక్షల తొంభై నాలుగు వేల మూడు వందల తొంభై రెండు మాత్రమే) ప్లస్ దానిపై వడ్డీ & ఇతర చార్జీలు రాబట్టుకొనుటకు 12.06.2024న "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా", "అక్కడ ఏమున్నదో అది" మరియు "ఏది అక్కడ ఉంటే అదే" ప్రాతిపదికన విక్రయించబడతాయని ఇందుమూలంగా సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీతలు, హామీదారులకు తెలియజేయడమైనది. రిజర్వు ధర మరియు బయానా దిగువ తెలియజేయబడినవి:

స్థిరాస్తుల వివరణ

క్ర. సం.	ఆస్తి వివరణ	రిజర్వు ధర (రూ. లక్షల్లో)	బయానా (రూ. లక్షల్లో)	ఇ-వేలం తేదీ మరియు సమయం
1	ఆంధ్ర ప్రదేశ్ , పశ్చిమగోదావరి జిల్లా, కొవ్వూరు మండలం, ఐ. పంగిడి గ్రామం వద్ద గల సర్వే నం. 146/2ఎ మరియు 146/2బి వద్ద గల సివిల్ కట్టడాలతో మరియు సౌకర్యాలతో 15803.40 చ.గజాలు విస్తీర్ణం కలిగిన ఫ్యాక్టరీ భూమి ఆస్తి యావత్తు.	359.87	36.00	12 జూన్ 2024న ఉ.11.00 గం.ల నుండి ఉ.11.30 గం.ల వరకు
2	ఆంధ్రప్రదేశ్ , పశ్చిమగోదావరి జిల్లా, దేవరపల్లి మండలం, ఎర్నగూడెం గ్రామం వద్ద గల ఆర్ఎస్ నం.518/1, నం.7-82& 7-83 కలిగిన 5129 చ.గజాలు విస్తీర్ణం కలిగిన వాణిజ్య ఆస్తి (భూమి , గోడౌన్స్ & భవనాలు)	69.89	7.00	12 జూన్ 2024న ఉ.11.30 గం.ల నుండి మ.12.00 గం.ల వరకు
3	ఆంధ్రప్రదేశ్, పశ్చిమగోదావరి జిల్లా, కొవ్వూరు మండలం, కాపవరం గ్రామం వద్ద గల సర్వే నెంబర్లు 362/8 మరియు 362/9 (సర్వే నంబర్లు 362/8ఎ, 362/8బి మరియు 362/9ఎ గా ప్రస్తుతం సబ్ డివైడ్ చేయబడినవి)లో 14859 చ.గ.లలోని 11083.60 చ.గ.ల విస్తీర్ణ ఖాళీ నివాసిత / వాణిజ్య భూమి.	199.50	20.00	12 జూన్ 2024న మ.12.00 గం.ల నుండి మ.12.30 గం.ల వరకు

ఆస్తుల తాలూకు పూర్తి వివరముల కొరకు మరియు అమ్మకానికి సంబంధించిన నియమ నిబంధనల కొరకు ఐడీబీఐ బ్యాంక్ వెబ్‌సైట్ అనగా www.idbibank.in మరియు https://www.bankeauctions.com లో ఇవ్వబడిన లింకును చూడండి. ఏదైనా స్పష్టీకరణల కొరకు ఆసక్తిగల పార్టీలు శ్రీ భగబత్ పాత్ర, అధీకృత అధికారి(సంప్రదించవలసిన నం.040-67694104, ఇ-మెయిల్ : bhagabat.patra@idbi.co.in), శ్రీ కళ్యాణ్ మునగాల, (సంప్రదించవలసిన నం.040-67694031) మరియు శ్రీ జి.వి.సాయి ప్రసాద్ (సంప్రదించవలసిన నం.9000899533)ను సంప్రదించవచ్చు. ఇ-వేలం సహకారం కొరకు శ్రీ పి. ధరణీకృష్ణ (C1 ఇండియా లిమిటెడ్) (సంప్రదించవలసిన నం.9948182222) (ఇ-మెయిల్: andhra@c1india.com) సంప్రదించండి.

తేది : 23.05.2024,
ప్రదేశం : హైదరాబాద్

సం/- అధీకృత అధికారి
ఐడీబీఐ బ్యాంక్ లిమిటెడ్

కాకినాడ

స్పాంజ్‌తో కళాకృతులు తయారీపై శిక్షణ

పెద్దాపురం, మే 23: స్థానిక వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్పాంజ్‌తో కళాకృతులు తయారు చేయడంపై చిన్నారులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ప్రముఖ పప్పెట్రీ షో ఉపాధ్యాయులు పల్లి గోవిందరాజులు వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా ఈ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



పోలేకుర్రు చెక్‌పోస్టు వద్ద ఆయిల్‌ట్యాంకర్‌ను పట్టుకున్న అధికారులు

డీజిల్ ఆయిల్ ట్యాంకర్ సీజ్

తాళ్లరేవు, మే 23: యానాం నుంచి అక్రమంగా రవాణా అవుతున్న డీజిల్ ఆయిల్ ట్యాంకర్‌ను రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్/ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం పి.మల్లవరం చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నట్టు సివిల్‌సప్లయ్ అధికారిణి లక్ష్మీప్రసన్న తెలిపారు. డీజిల్ అక్రమ రవాణా జరుగుతుందని సమాచారం మేరకు విజిలెన్స్, రెవెన్యూ, సివిల్‌సప్లయ్ అధికారులు సంయుక్తంగా పోలేకుర్రు చెక్‌పోస్టు వద్ద అశోక్‌లేలాండ్ ఆయిల్ ట్యాంకర్ వాహనాన్ని పట్టుకున్నారు. సదరు ఆయిల్ ట్యాంకర్ నందు రూ.8,39,000 విలువచేసే 4000లీటర్ల డీజిల్ ఉన్నట్టు గుర్తించారు. యానాంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్‌బంక్ నుంచి ఆయిల్‌ట్యాంకర్ డ్రైవర్ గోవాల సుబ్బారావు అలియాస్ సుధీర్ టాటాఏసీ వాహనం ద్వారా లీటరు రూ.84కు కొనుగోలుచేసి తదుపరి మోటార్, పైపు సాయంతో అశోక్ లేలాండ్ ఆయిల్ ట్యాంకర్ వాహనంలోకి లోడు అవుతుంది. అశోక్ లేలాండ్ ట్యాంకర్/టాటా ఏసీ వాహనం యజమాని అడ్డాల వీర వెంకట సత్యనారాయణ ఆదేశాల మేరకు సదరు డీజిల్‌ను తాళ్లరేవుకు రవాణా చేసి అక్కడ గల చేపలు, రొయ్యల చెరువుల మోటార్ ఇంజన్లుకు లీటరు రూ.88కు అమ్మకము చేయనున్నారు. ట్యాంకర్‌ను సీజ్ చేసి రవాణా చేసే వ్యక్తులపై క్రిమినల్ కేసులకు కోరింగ పోలీసులకు సిఫార్సు చేశారు. తనిఖీల్లో రిజనల్ విజిలెన్స్ ఎస్పీ కెఎస్.సుబ్బారెడ్డి, విజిలెన్స్ అధికారులు జగన్నాథరెడ్డి, లక్ష్మీనారాయణ, డిఎస్‌వో ప్రసాద్, మండల సివిల్ సప్లయ్ అధికారిణి టి.లక్ష్మీప్రసన్న, రమణలక్ష్మీదేవి, లోవరాజు ఉన్నారు.

నేటి నుంచి టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

సామర్లకోట, మే 23: పదోతరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి సామర్లకోటలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ఆయా కళాశాలలు, ఉన్నతపాఠశాలలు విద్యార్థులకు హాల్ టిక్కెట్లు అందజేశారు. సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 141 మంది ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్నారని ప్రిన్సిపాల్ లీలా శ్రీదేవి తెలిపారు. సామర్లకోటలోని యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 159 మంది, అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 192 మంది, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 169 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరవుతున్నట్లు ఎంఈవో-2 పి.పుల్లయ్య తెలిపారు. ముగ్గురు చీఫ్ సూపరింటెండెంట్లు, ముగ్గురు డిపార్ట్‌మెంట్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, 26 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్షకు హాజరయ్యేవారు మినహా మరెవ్వరూ పరిసరాలకు రాకూడదని చెప్పారు.

రేపు వైశాఖ పూజా మహోత్సవం

పిఠాపురం, మే 23: పట్టణంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం వైశాఖ పూజా మహోత్సవం నిర్వహిస్తున్నట్టు అర్చకులు తెలిపారు. భక్తుల సహకారంతో ఉదయం విశేషపూజ, సాయంత్రం 6గంటలకు సహస్ర నామార్చన, పండితులతో వేదస్వస్తి తదితర కార్యక్రమాలు జరుగుతాయి. అనంతరం భక్తులకు విసనకర్రలు, మామిడిపండ్లు వితరణ జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని ఆలయ ఈవో నున్న శ్రీరాములు, అర్చకుడు పి.విజయజనార్థనాచార్యులు కోరారు.

ఖరీఫ్ ముందస్తు ప్రణాళిక సమావేశం

గండేపల్లి, మే 23: స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో గురువారం ఖరీఫ్-2024 ముందస్తు ప్రణాళిక సన్నాహక సమావేశం ఏవో సద్గురుమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా వనరులు కేంద్ర వ్యవసాయశాఖ అధికారి సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రసాయన ఎరువులు వినియోగం తగ్గించి పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువులు వినియోగం పెంచడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించడంతో పాటు భూమి ఆరోగ్యం కాపాడచ్చన్నారు. ఏవో సద్గురుమూర్తి మాట్లాడుతూ నీటిబోరు కింద వరి పండించే రైతులను ఇతర పంటలకు మళ్లించి మేలైన దిగుబడులు పొందేలా మూడేళ్ల వయస్సులోపుండే ఆయిల్‌పామ్ తోటల్లో అంతరపంటలుగా చిరుధాన్యాలు, అపరాల సాగు చేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు.

రౌతులపూడిలో...

రౌతులపూడి, మే 23: ఖరీఫ్ ముందస్తు ప్రణాళికపై రౌతులపూడి ఆర్బీకే సెంటర్ నందు మండల వ్యవసాయశాఖాధికారి రెడ్డి ఈశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ పంటకాలానికి విత్తన సరఫరా, ఎరువులు వినియోగం ఫెర్టిలైజర్స్ తదితర అంశాలపై సిబ్బందికి వ్యవసాయాధికారి పలు సూచనలు చేశారు.

'రోడ్లపై చెత్త వేస్తే జరిమానా'

కార్పొరేషన్ (కాకినాడ), మే 23: రోడ్లపై చెత్త వేస్తే జరిమానా తప్పదని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్.నాగనరసింహారావు స్పష్టం చేశారు. గురువారం ఆయన ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్‌తో కలిసి నగరంలో జరుగుతున్న పూడికతీత పనులను పర్యవేక్షించారు. పలు ప్రాంతాల్లో ఇంటింటికి చెత్త సేకరణ, తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. వర్షాలు పడేలోపు పూడికతీత పనులు వేగవంతంగా చేయాలన్నారు. చెత్తను టిప్పర్ వాహనాలకు ఇవ్వకుండా రోడ్లపైన, డ్రైనేజీల్లో వేస్తున్నారని ఈవిధానాన్ని మానుకోవాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, ఇన్‌స్పెక్టర్ రవివర్మ ఉన్నారు.

'పెట్రోల్, డీజిల్ విక్రయాలు వద్దు'

ప్రత్తిపాడు, మే 23: పెట్రోల్, డీజిల్ లూజు విక్రయాలు వద్దని ప్రత్తిపాడు తహశీల్దార్ నరసింహారావు సూచించారు. గురువారం ప్రత్తిపాడు, ఒమ్మంగి, ధర్మవరంలోని పెట్రోల్ బంకులను ఆయన సందర్శించి డీజిల్, పెట్రోల్ లూజు అమ్మకాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎన్నికల సంఘం కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల కౌంటింగ్ పూర్తయిన 15రోజుల వరకు పెట్రోల్, డీజిల్‌లను కేవలం బంకు వద్దకు వచ్చిన వాహనాల్లో నింపాలని ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూపోలీస్ సిబ్బంది ఉన్నారు.

'డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలి'

తాళ్లరేవు, మే 23: తాళ్లరేవు గ్రామంలో చాలా అస్తవ్యస్థంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు కుడిపూడి దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం ఆయన తాళ్లరేవులో మాట్లాడుతూ డ్రైనేజీలో మెయిన్‌రోడ్డులో డ్రైనేజీ ఎక్కడిక్కడ మూసుకుపోవడంతో మురుగునీరు నిలిచిపోతుందన్నారు. శ్రీరామనగర్ డ్రైన్‌లో మురుగునీరు బయటకు వెళ్లేమార్గంలేక దుర్వాసన వస్తుందని, పంచాయతీ అధికారులు తగు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

కిర్లంపూడిలో 'అన్నమయ్య సంకీర్తన గానామృతం'

కిర్లంపూడి, మే 23: తాళ్లపాక అన్నమాచార్యులు 616వ జయంతి ఉత్సవాలు పురస్కరించుకుని కిర్లంపూడిలో అన్నమయ్య సంకీర్తన గానామృతం కార్యక్రమం నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం ఆలయ ధర్మకర్త పెంటకోట నాగబాబు ఆధ్వర్యంలో పిఠాపురానికి చెందిన పాజమూరి గాయత్రి బృందంతో అన్నమయ్య సంకీర్తనల కార్యక్రమం చేపట్టారు. భక్తులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ గెలవాలని పూజలు

జగ్గంపేట, మే 23: పిఠాపురం నుంచి పవన్‌కల్యాణ్ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలవాలని, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఎన్నికల ఫలితాల్లో అధిక స్థానాలు గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరుకుంటూ జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ జ్యోతిర్లింగాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మహారాష్ట్ర త్రయంబకేశ్వర స్వామిని ఆయన దర్శించుకుని పూజలు నిర్వహించారు.

వైభవంగా ముత్యాలమ్మ తల్లి జాతర

కొత్తపల్లి, మే 23: కొత్తపల్లి ఆడపడుచు శ్రీముత్యాలమ్మ తల్లి జాతర గురువారం వైభవంగా జరిగింది. అమ్మవారుగా భావించి తాటిచెట్టు(సిరితాడు)ను బండిపై గ్రామంలో దర్శనార్థం ఊరేగించారు. సాయంత్రం అమ్మవారి ఆలయా నికి చేరిన సిరితాడును ఏర్పాటు చేసిన అనంతరం జాతర ప్రారంభమైంది. భక్తులు ముత్యాలమ్మతల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు పులిహోర పంపిణీ చేశారు.

సెల్ టవర్ ఎక్కి యువకుడు ఆత్మహత్యాయత్నం

కాకినాడ క్రైం,మే 23: సెల్‌ఫోన్ దొంగతనం చేశాడని నిందలు వేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన యువకుడు సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం కాకినాడలో జరిగింది. పిఠాపురం మండలం చిత్రాడకు చెందిన ప్రదీప్‌కుమార్(26)పై సెల్‌ఫోన్ దొంగతనం చేశావని స్థానికులు నిందలు వేయడంతో తీవ్ర మనస్తాపానికి గురై కాకినాడ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఎస్ఐ ఎం.సాగర్‌బాబు సిబ్బందితో చేరుకుని న్యాయం చేస్తామని భరోసా ఇవ్వడంతో ప్రదీప్‌కుమార్ సెల్ టవర్ దిగాడు. పోలీసులు ప్రదీప్‌కుమార్‌కు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆత్మహత్యాయత్నాన్ని నిలువరించిన ఎస్ఐ బృందాన్ని ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు.

కరెంట్ కట్!

- రాత్రి 9.30 నుంచి తెల్లవారుజాము 3.30గంటల వరకూ సరఫరా నిలిపివేత
- ఫోన్లు ఎత్తని విద్యుత్‌శాఖ అధికారులు
- ఆందోళనకు దిగిన వినియోగదారులు
- పిఠాపురంలో పదిరోజులుగా ఇదే పరిస్థితి



పిఠాపురంలో విద్యుత్ సబ్‌స్టేషన్

పిఠాపురం, మే 23: విద్యుత్‌శాఖ అధికారులు ప్రజలకు ప్రత్యక్ష నరకం చూపించారు. బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకూ ఆరుగంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సబ్‌స్టేషన్ సిబ్బంది, విద్యుత్‌శాఖాధికారులు ఫోన్లు ఎత్తలేదు. విసిగిపోయిన కొందరు వినియోగదారులు సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లి ఆందోళనకు దిగడంతో అప్పుడు తీరిగ్గా స్పందించారు. పదిరోజులుగా పగలు, రాత్రి బేధం లేకుండా విద్యుత్ సరఫరాలో తరచూ వస్తున్న అంతరాయాలు ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. పిఠాపురంలోని సీతయ్యగారితోట, విద్యుత్‌నగర్, మంగాయమ్మరావుపేట, చిట్టోడితోట, జీవన్‌నగర్, మెయిన్‌రోడ్డు, జగ్గయ్యచెరువు కాలనీ, పాదగయ సెంటర్ సహా పలు ప్రాంతాల్లో బుధవారం రాత్రి 9.30గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఒకటి, రెండు ప్రాంతాల్లో అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంటకు, మిగిలిన ప్రాంతాల్లో గురువారం తెల్లవారుజాము 3.30గంటల వరకూ విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరగలేదు. ఇన్వర్టర్లు పనిచేయకపోవడం, ఉక్కపోత వాతావరణంతో ప్రజలు ప్రత్యక్షనరకాన్ని చవిచూశారు. విద్యుత్‌శాఖాధికారులు, సబ్‌స్టేషన్‌కు ఫోన్లు చేస్తున్నా ఎవ్వరు స్పందించకపోవడంతో వినియోగదారులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశా రు. వినియోగదారులు సబ్‌స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. జంపర్లు కాలిపోవడం, ఇతర సాంకేతిక సమస్యలు కారణమంటూ వారు చెప్పిన సమాధానంతో వారు సంతృప్తి చెందలేదు. కరెంటు ఎప్పుడు వస్తుందో చెప్పాలంటూ నిలదీయడంతో అప్పుడు తీరిగ్గా స్పందించారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలు కరెంటు లేక, ఉక్కపోతతో నిద్రపట్టక రోడ్లపైకి వచ్చారు. కొంత మంది వినియోగదారులు ఏపీఈపీడీఎస్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్‌కు కాల్ చేసి ఫిర్యాదులు చేశారు. మరమ్మతులు నిర్వహించేందుకు గంట నుంచి రెండు గంటలు మాత్రమే సమయం పడుతుందని, అయితే విద్యుత్ సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇబ్బందులు పడ్డామని పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురంలో 10-15రోజులుగా విద్యుత్ సరఫరా తరచూ నిలిచిపోతున్నది. రోజుకు 10-12 పర్యాయాలు సుమారు 4గంటల పాటు అనధికారికంగా కోత విధిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. గురువారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకూ ఏడు సార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇవన్నీ సాంకేతిక సమస్యలుగా విద్యుత్ అధికారులు చెబుతున్నా అప్రకటిత కోతలుగా వినియోగదారులు భావిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో తరచూ వస్తున్న అంతరాయాలు, కరెంట్ కట్‌లపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిఠాపురం, మే 23: పిఠాపురంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీఎల్ ఈఈ ఏడీఎన్‌డీఎస్ ప్రభాకర్ తెలిపారు. విద్యుత్‌లైన్ల మరమ్మతులు, ట్రీ ట్రిమ్మింగ్ కారణంగా పిఠాపురం సబ్‌స్టేషన్ ఆదర్శ ఫీడర్‌పై గల అగ్రహారం, కోర్టు, పశువుల సంత, దత్తాత్రేయ గుడి, కుమ్మరి వీధి, తారకరామనగర్, వైఎస్ఆర్, బీఎస్ఆర్ గార్డెన్లు, బొజ్జా వారి తోట, మాధవపురం రోడ్, లయన్స్ కల్యాణమండపం, అన్నపూర్ణ థియేటర్, రెడ్డి గారి మెస్, మాధవనగర్, సాయిదత్త నగర్, బీఎస్ఎన్ఎల్ ఆఫీసు, ఎల్ఐసీ వీధి, రామా థియేటర్ సెంటర్, డ్రైవర్స్ కాలనీ, మోహననగర్, అయితేనగర్, కొత్తకొంపలు, ఏడుకాలువలు, టిడ్కో గృహాలు, గోర్స రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 7 గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదని. విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

ప్రత్తిపాడు మండలంలో...

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. మండలంలోని శాంతి ఆశ్రమం, పొదురుపాక, గజ్జెనపూడి, శరభవరం, యుజేపురం, వెంకటనగరం, పోతులూరు, వాకపల్లి, బౌరువాక, పాండవులపాలెం, చింతలూరు గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. శాంతి ఆశ్రమం ఫీడర్‌లోని విద్యుత్ లైన్లకు అవరోధంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమంలో భాగంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని వారు తెలిపారు

గండేపల్లి మండలంలో...

గండేపల్లి, మే 23: గండేపల్లి మండలంలోని సూరంపాలెం 11కెవి ఫీడర్, ఇండస్ట్రీయల్ ఫీడర్ మరమ్మతులు, లైన్‌పై చెట్ల కొమ్మలు తొలగించడం వల్ల శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈ రత్నాలరావు తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సూరంపాలెం, రామేశ్వరంపేట గ్రా మాల్లో... యర్రంపాలెం, సూరంపాలెం వ్యవసాయ బోర్లకు, సూరంపాలెం ఇండస్ట్రీయల్‌కు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.



బయలుదేరిన లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

కొండబాబు విజయం సాధించాలని అన్నవరం వరకు సైకిల్ యాత్ర

కాకినాడ సిటీ, మే 23: కాకినాడ సిటీ ఎమ్మెల్యేగా వనమాడి కొండబాబు భారీ మెజారిటీతో విజయం సాధించాలని కోరుతూ కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు చెందిన పలువురు సభ్యులు గురువారం కాకినాడ నుంచి అన్నవరం వరకు సైకిల్ యాత్ర నిర్వహించారు. స్థానిక సంజయ్‌నగర్ సెంటర్ వద్ద ఈ యాత్రను టీడీపీ నాయకులు తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ జెండా ఊపి ప్రారంభించారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు పెదిరెడ్ల నానాజీ, వెలుగుల శ్రీనివాస్, ముదునూరి సతీష్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాకినాడ సిటీలో కొండబాబును గెలిపించుకోవడానికి తామంతా సాయశక్తులా కృషి చేశామన్నారు. కొండబాబు నామినేషన్ వేసినప్పుడే ఆయనను గెలిపించమని అన్నవరం సత్యనారాయణస్వామికి మొక్కుకున్నామన్నారు. ఇంకా లెక్కింపు అవ్వకుండానే కొండబాబు విజయానికి చిహ్నంగా తామంతా అన్నవరం సైకిల్ యాత్రగా వెళ్లి మొక్కు తీర్చుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అల్లం రాజు, ఎలిపే శ్రీనివాస్, అరగండ్ల గంగబాబు, దుర్గాప్రసాద్, పినపోతుల రవి, ప్రవీణ్‌కిషోర్, పోలవరం శివ, యలమంచలి సత్తిబాబు, పార్టీ నాయకులు బాసి రమణ, పలివెల బాబ్జి, నిద్రబింగి సత్తిబాబు, ఎస్‌కె జిలాని, బాష, అన్నవరం, దొర తదితరులున్నారు.

'కౌంటింగ్‌కు సహకరించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామారావు

పెద్దాపురం, మే 23: రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు, ఏజెంట్లు, అభ్యర్థులు వచ్చే నెల 4న జరిగే ఓట్ల కౌంటింగ్ ప్రక్రియకు సహకరించాలని పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.సీతారామారావు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో రాజకీయపార్టీలకు చెందిన ప్రతినిధులు, ఏజంట్లతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ సజావుగా సాగాలంటే ఏజెంట్ల సహకారం ఎంతో అవసరమన్నారు. వచ్చే నెల 4న జేఎన్టీయూకేలో కౌంటింగ్ జరుగుతుందన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్‌కు విడివిడిగా కౌంటింగ్ జరుగుతుందన్నారు. లెక్కింపు సమయంలో ఏ ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్‌లు లోపలకు అనుమతించబోమన్నారు. కౌంటింగ్‌కు సంబంధించి 14 టేబుల్స్ ద్వారా 15 రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ జరిగేందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్లు ఎస్.శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, ఏజెంట్లు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న నగదు అందజేత

తుని రూరల్, మే 23: సికింద్రాబాద్ నుంచి కటక్ వెళ్లే ఈస్ట్‌కోస్ట్ రైలు నుంచి ఉత్తమ్‌కుమార్ సాహూ అనే యువకుడు రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో దిగగా ఆయన తిరిగి ఎక్కేలోగా రైలు బయల్దేరి వెళ్లింది. అయితే సదరు వ్యక్తి సూట్‌కేస్, నగదు, రైలులో ఉండిపోవడంతో టోల్‌ఫ్రీ నెంబరును సంప్రదించాడు. దీంతో డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ డి.ప్రసాదరావు, శ్రీనివాసరావు, ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ అనీల్ సూట్‌కేస్‌ను గవర్నమెంట్ రైల్వేపోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి తనిఖీ చేశారు. అందులో రూ.74వేలు నగదు ఉండడంతో సూట్‌కేస్ పోగొట్టుకున్న సాహూకు నగదు, సూట్‌కేస్‌ను రైల్వే ఎస్ఐ అబ్దుల్ మారుఫ్ ఆదేశాల మేరకు తిరిగిచ్చారు.

గీత కార్మికుడి కుటుంబానికి సాయం

కొత్తపల్లి, మే 23: కొమరగిరి శివారు వెంకటరాయపురానికి చెందిన గీత కార్మికుడు లక్ష్మణరావు తాటిచెట్టు పై నుంచి పడి మృతిచెందడం విధితమే. మాజీ జెడ్పీటీసీ వెంగళి సుబ్బారావు లక్ష్మణరావు కుటుంబాన్ని పరామర్శించి నగదు, నిత్యావసర వస్తువులు అందజేశారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తానన్నారు.

విద్యార్థులకు శిక్షణ

ఏలేశ్వరం, మే 23: గ్రంథాలయ శిక్షణా శిబిరంలో భాగంగా గురువారం స్థానిక గ్రంథాలయ పాలకులు కవికొండ సత్యనారాయణ విద్యార్థులకు సంగీతం, డాన్సులు, నృత్యం, కోలాటం, క్విజ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

మాతృ, శిశు మరణాలను

తగ్గించే దిశగా పని చేయాలి

డీఎంహెచ్‌వో నరసింహనాయక్



సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

జీజీహెచ్ (కాకినాడ) మే 23: జిల్లాలో వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరూ మాతృ, శిశు మరణాలను తగ్గించే దిశగా పని చేయాలని డీఎంహెచ్‌వో డా.జె.నరసింహనాయక్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న మాతృ, శిశు మరణాలను తగ్గించే దిశగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పటిష్ట చర్యలు చేపడుతుంది. అందులో భాగంగా డీఎంహెచ్‌వో గురువారం ఆయన కార్యాలయంలో అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సిలు, యూహెచ్‌సీల వైద్యాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గత నెలలో జరిగిన మాతృ మరణాలకు గల కారణాలపై విశ్లేషించి ప్రమాదకర పరిస్థితిలో ఉన్న హైరిస్క్ గర్భిణులను ముందుగా గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రభుత్వాసుపత్రులలో ప్రసవాలు అయ్యే విధంగా అలాగే ప్రసవాంతర వైద్య సేవలు కచ్చితంగా అమలు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా గత నెలలో జరిగిన 31 శిశు మరణాలకు గల కారణాలు విశ్లేషించి ఇక ముందు మరణాల సంఖ్య తగ్గించేందుకు మరింత బాధ్యత వహించి ప్రతి ఆరోగ్య కేంద్రంలో శిశు మరణాలు జరగకుండా అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ఆదేశించిన మాతా,శిశు లక్ష్యాలను నూటికి నూరు శాతం సాధించాలని ఆదేశించారు. డీఐవో డా.కె.రత్నకుమార్ మాట్లాడుతూ వివిధ శాఖల సమన్వయంతో లక్ష్యాలను సాధించాలని కోరారు. వ్యాధినిరోధక టీకాల కార్యక్రమంలో సంభవించే ప్రతికూల సంఘటనలపై (ఎఈఎఫ్ఐ) జిల్లా కమిటీ సమీక్ష జరిగింది. ఈ ఏడాది జరిగిన 3 ఎఈఎఫ్ఐ కేసులపై కమిటీ సభ్యులు చర్చించి తీసుకోవల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కమిటీలో ఎస్ఎంఓ డా.జాన్ జుడే జామవా, ఎపిడమాలజిస్ట్ డా.దేవిమాధవి, డా.ప్రసన్నకుమార్, డా.షరిఫ్ పాల్గొన్నారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ డా.ఎస్.స్వప్న, డా.రమాదేవి, డా.జయదేవ్, డా.చంద్రప్రభ, గణాంకాధికారి విజయలక్ష్మి, డీఎస్‌వో గణేష్, డెమో ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

తాత్వికజ్ఞానంతో జీవితం సుఖమయం

డాక్టర్ ఉమర్‌ఆలీషా




జీవన సంహిత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆలీషా

పిఠాపురం, మే 23: తాత్వికజ్ఞానాన్ని పొందడం ద్వారా ప్రతి ఒక్కరు తమ జీవితాన్ని సుఖమయం చేసుకోవచ్చని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా అన్నారు. పిఠాపురం శివారులోని పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో గురువారం వైశాఖ పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. కుటుంబ వ్యవస్థను పటిష్టంగా ఉంచేది ఆధ్యాత్మిక, తాత్విక, జ్ఞాన సంస్కృతి అని తెలిపారు. ఆధ్యాత్మిక భావనలు వికసింప చేసే జ్ఞానతత్వం వల్ల మానవునిలో మానసిక తత్వం చైతన్యవంతమవుతుందన్నారు. మానవునికి ముక్తిమార్గం చూపించే లక్ష్యంగా అన్ని మతాలు పాటుపడుతున్నాయని, సర్వమతాల సారం ఒక్కటేనని తెలిపారు. ధర్మసూత్రాలను వినడమే కాకుండా వాటిని ఆచరించిమానవతా విలువలు పెంపొందించుకోవాలని సూచించారు. పశుపక్ష్యాదుల దాహార్తిని తీర్చే విధంగా ప్రత్యేక చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. వైశాఖ పౌర్ణమి విశిష్టతను వివరించారు. అనంతరం ప్రముఖ కవి డాక్టర్ వాసిలి వసంతకుమార్ రచించిన జీవనసంహిత పుస్తకాన్ని, చిన్నసంకల్పం పెద్ద ఆశీస్సు గోడపత్రికలను ఉమర్‌ఆలీషా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం జడ్జి చక్కా సుశీ, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, ఆకుల రవితేజ, ఎన్‌టీవీ ప్రసాదవర్మ, ఏవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అపర్ణాదేవికి విశేష అలంకారం

గొల్లప్రోలు రూరల్, మే 23: గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు జరిగాయి. అపర్ణా అమ్మవారికి పంచామృత సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం 11 రకాల పుష్పాలు, ఏకబిల్వము, త్రిదళము, మహాబిల్వములతో దవనము, మరువము పత్రితో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం సహస్ర నామకుంకుమార్చన, అష్టోత్తర శత నామ కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.



తాగునీటి సరఫరాలో మున్సిపల్ అధికారుల వైఫల్యం!

సామర్లకోట, మే 23: పట్టణ ప్రజలకు 2 పూటలా శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేయాల్సిన మున్సిపల్ అధికారులు గత 2 రోజులుగా పసరు రంగులో నీటిని సరఫరా చేస్తూ ప్రజల దాహార్తి తీర్చడంలో పూర్తిగా విఫలం అయ్యారు. సామర్లకోట-ఉండూరు రోడ్డులో వేసవి జలాశయంలో తగినన్ని నీటినిల్వలు ఉన్నప్పటికీ ఆ నీటిని శుద్ధిచేయడంలో సాంకేతిక విలువలను పాటించకపోవడం వల్లే తాగునీరు పూర్తిస్థాయిలో శుద్ధి కావడంలేదని అందుకే 2రోజులుగా పసరురంగులో తాగునీటిని సరఫరా చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఏటా వేసవి సీజన్‌లో ప్రజలకు 2 పూటలా తాగునీటిని సరఫరా చేయడంలో అధికారులకు ముందుచూపు కొరవడడం వల్లే ప్రజలు నేడు త్రాగునీటికి అవస్థలు పడాల్సివస్తుందని పలువురు వాపోతున్నారు. కాగా ఈ సమస్యపై పలువురు ఫిర్యాదుల మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు తదితర ఇంజనీరింగ్ అధికారులు ఫిల్టర్‌వాటర్ స్కీంను సందర్శించారు. నీరు పసరు రంగులో రావడానికి గల కారణాలను స్థానిక అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అయితే ప్రజలకు సరఫరా అవుతున్న తాగునీటిని కాచి వడకాచి మాత్రమే తాగాలని ప్రజలకు మున్సిపల్ కమిషనర్ రామారావు సూచించారు. దీనిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుంది.

ఘనంగా శ్యామలాంబ జాతర

సామర్లకోట, మే 23: అచ్చంపేట, గొంచాల గ్రామ దేవతలుగా ప్రసిద్ధి పొందిన శ్యామలాంబ అమ్మవార్ల జాతర ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. భక్తులు నైవేద్యాలు సమర్పించుకున్నారు. బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకూ జాగరణ నిర్వహించారు.

ఘనంగా ప్రత్యంగిర హోమం



హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, మే 23: రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో పౌర్ణమి పర్వదినం సందర్భంగా ప్రత్యంగిర హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం ప్రత్యంగిర దేవతను ఆవాహన గావించి హోమములు, జపములు, పారాయణలు నిర్వహించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సత్యదేవుని సన్నిధిలో కోలాటం

కోటనందూరు, మే 23: అన్నవరం సత్యదేవుని సన్నిధిలో దివ్యకల్యాణం పురస్కరించుకుని మండలంలోని పాతకొట్టాం గ్రామానికి చెందిన శ్రీసీతారామ కోలాటబృంద బాల బాలికలు కోలాటం నిర్వహించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కోలా టం గురువు అడిగర్ల రమణబాబు శ్రీనివాసు, నాగేశ్వరరావు, నాగలక్ష్మి, యడ్ల చెల్లారావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో చండీహోమం

పెద్దాపురం, మే 23: స్థానిక మరిడమ్మ దేవస్థానంలో చండీహోమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి 700 శ్లోకాలతో వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు పర్యవేక్షణలో అమ్మవారికి శాస్త్రోక్తంగా అభిషేకాలు, పూజలు చేశారు. ప్రజలకు సకల శుభాలు, కార్యాలు నెరవేర్చేందుకు ఈ హోమం నిర్వహిస్తారని పండితులు పేర్కొన్నారు. అధిక సంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు, అమ్మవారికి పుష్పపూజలు చేశారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు, ప్రసాద్, విజయ్‌కమార్ ఉన్నారు.

ముత్యాలమ్మతల్లికి క్షీరాభిషేకం

తాళ్లరేవు, మే 23: వైశాఖపౌర్ణమి సందర్భంగా పి.మల్లవరంలో వేంచేసిన శ్రీముత్యాలమ్మతల్లికి నరాల అప్పారావు, లక్ష్మీరుక్మిణి దంపతులతో క్షీరాభిషేకం నిర్వహించారు. కుంకుమ, పలు పూజలను అర్చకులు కందవిల్లి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో చేశారు. ఆలయకమిటీ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ విల్ల సత్యనారాయణ, వుంగరాల వెంకటేశ్వరరావు, పితాని వీరబాబు, దున్నా సింహాద్రమ్మ, గంగాభవాని తదితరులున్నారు.

గౌతమ బుద్ధ జయంతి

జగ్గంపేట, మే 23: సిద్ధార్థ గౌతమ బుద్ధుడి జయంతిని జగ్గంపేట వాసుదేవ నగర్‌లో ఏర్పాటు చేసిన బుద్ధ విహార్‌లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ కార్యదర్శి పులి ప్రసాద్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉల్లం నందిని, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సాదే నరేంద్రబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

సీమాంధ్ర సంఘ వార్షికోత్సవం

ప్రత్తిపాడు, మే 23: సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం స్థాపించి 10 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్తి అప్పలరాజు కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచారు. నియోజకవర్గ అధ్యక్షుడు మదినేనూకరాజు, కార్యదర్శులు ఒమ్మి గంగరాజు, కట్టమూరి కొండబాబు, జిల్లా ఉపాధ్యక్షులు యడ్ల వీరాస్వామి పాల్గొన్నారు.

యనమలను కలిసిన నాయకులు

తుని రూరల్, మే 23: శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడును తేటగుంటలో పలువురు దళిత నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించి దళితుల సమస్యలను వివరించారు. యనమలను కలిసిన వారిలో జిల్లా ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ కొల్లాబత్తుల అప్పారావు, నియోజకవర్గానికి చెందిన నాయకులు ఉన్నారు.

ఎల్ఐసీ బీఎంగా రాము

పిఠాపురం, మే 23: పిఠాపురంలోని జీవిత భీమా సంస్థ (ఎల్ఐసీ) బ్రాంచి మేనేజరుగా జే.రాము గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన యానం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ బీఎంగా పనిచేసిన ఎస్.రాము చౌహాన్ పదోన్నతిపై నల్గొండ జిల్లా దేవరకొండకు బదిలీ అయ్యారు. రామును సిబ్బంది, అధికారులు అభినందించారు.

అన్నదానం

రౌతులపూడి, మే 23: శృంగవం, బంగారయ్యపేట, గౌరంపేట, కొత్తపల్లి గ్రామాలకు వెళ్లే నాలుగు గ్రామాల రోడ్డు జంక్షన్‌లో గల నల్లగొండమ్మ తల్లి ఆలయం వద్ద అమ్మవారి పండుగను పురస్కరించుకుని ఆలయ ధర్మకర్త ఈగల సత్తిబాబు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నిత్యావసరాల పంపిణీ

గండేపల్లి, మే 23: సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పెద్దాపురంలో మన ఇల్లు వృద్ధాశ్రమంలో రూ.25వేలు విలువైన నిత్యావసర వస్తువులు రైస్, గ్లూకోస్, బిస్కెట్‌ప్యాకెట్లు, పండ్లు, తినుబండారాలను వృద్ధులకు పంపిణీ చేశారు. విద్యార్థులంతా రైస్‌ను సేకరించి అందించారు. ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు బి.రాంబాబు,ఐవి వీరాంజనేయులు పాల్గొన్నారు.



